ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

5

శుక్రవారం 25 అక్టోబరు 2024

న్యూస్ బాక్స్

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



పీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

మందమర్రి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను గురువారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి సంబంధించి చర్చించినట్లు తెలిపారు.

ఈ నెల 28న ఉమ్మడి జిల్లా సదస్సు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 28న ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లా సదస్సులో భాగంగా బహిరంగ విచారణ జరుగుతుందని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వెనకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ విచారణకు సంచార జాతుల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని బీసీ కులాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పనులు ప్రారంభం

బెల్లంపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2, 4, 6, 29 వార్డుల్లో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత సీసీ రోడ్ల, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని వార్డులను అభివృద్ధి చేశామన్నారు.

దీపావళి ధమాకా..



- సింగరేణి కార్మికులకు నేడు బోనస్ జమ
- ఒక్కో కార్మికునికి రూ. 93వేలు చెల్లింపు

మంచిర్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు దీపావళి (పీఎల్ఆర్) బోనస్ ఈ నెల 25న బ్యాంకుల్లో జమ చేయనుంది. ఈ మేరకు రూ.358 కోట్లు యాజమాన్యం చెల్లించేందుకు ప్రకటించింది. గత నెల 29న ఢిల్లీలో జరిగిన పీఎల్ఆర్ బోనస్ చర్చల్లో కార్మికులకు దీపావళి బోనస్‌ను యాజమాన్యం ప్రకటించింది. యాజమాన్యం నిర్ణయంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో కార్మికునికి రూ.93 వేలు

దీపావళి బోనస్‌ను యాజమాన్యం ముందస్తుగా ప్రకటించింది. ఇందులో భాగంగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న సుమారు 44వేల మంది కార్మికులకు ఒక్కొక్కరికి రూ.93,750 చొప్పున బ్యాంకుల్లో జమ చేయనుంది. దీపావళి బోనస్ గతేడాదితో పోల్చితే ఒక్కో కార్మికుడికి రూ.8,250 అదనంగా అందనుంది. గతేడాది ఒక్కో కార్మికుడికి రూ.85,500 చెల్లించగా, ప్రస్తుతం రూ.8,250 పెంచుతూ బోనస్‌ను చెల్లిస్తున్నారు. బోనస్‌ను యాజమాన్యం యేటా పెంచుతూ వస్తుండటంతో కార్మిక కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

కార్మికుల సంక్షేమం కోసం

సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది. దసరా పండుగను పురస్కరించుకొని లాభాల వాటాను 33 శాతం పెంచగా, ఒక్కో కార్మికునికి సుమారు రూ.3 లక్షల పై చిలుకు నగదు బ్యాంకుల్లో జమ చేసింది.

ప్రస్తుతం దీపావళి బోనస్‌ను కూడా రూ. 8వేలకు పైగా పెంచడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రగతి బాటన పయనిస్తున్న కంపెనీ కార్మికుల సంక్షేమంపై కూడా దృష్టి సారించింది. సొంత ఇండ్లు నిర్మించుకున్న కార్మికులకు పది లక్షల రుణంపై వడ్డీ చెల్లింపు, క్వార్టర్లకు ఏసీ సౌకర్యం, ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబానికి ఇచ్చే మ్యాచింగ్ గ్రాంటు మొత్తాన్ని పది రెట్లకు పెంచడం, కార్మికులు చెల్లించే కరెంటు చార్జీలు రద్దు, ఉన్నత చదువులో ఉన్న కార్మిక పిల్లలకు ఫీజు చెల్లింపు, లాభాల బోనస్, పండుగ అడ్వాన్స్ పెంపు, తదితర చర్యలు చేపడుతోంది.

మిగతా 7లో...

బెటాలియన్ ఎదుట ధర్నా



గుడిపేట బెటాలియన్ ముందు ధర్నా చేస్తున్న పోలీసుల కుటుంబీకులు

హాజీపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బెటాలియన్ పోలీసుల సెలవుల విధానాన్ని మార్చాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గుడిపేట 13వ బెటాలియన్ ఎదుట గురువారం పోలీసుల కుటుం బీకులు ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరిం చాలని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగానే రాష్ట్రంలోనే అదే తరహా వ్యవస్థను అమలు చేయాలన్నారు. కొత్తగా అమ లులోకి వచ్చే రికార్డు పద్ధతిని ఉపసంహరించుకోవాలని, పనిభారాన్ని 8 గంటలకు తగ్గించాలని కోరారు. బెటాలి యన్‌లో కూడా 5ఏండ్ల వరకు ఒకే ప్రాంతంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ఇక్కడ బెటలియన్ పోలీసుల కుటుంబీకులు పాల్గొన్నారు.

సాధారణ పౌరులకే 'ఫ్రెండ్లీ పోలీసింగ్'..

ఇంటర్వ్యూ

- సంఘ విద్రోహ శక్తులపై ఉక్కుపాదమే..
- భూ ఆక్రమణదారులపై పీడీ యాక్టు.. సిద్ధమవుతున్న జాబితా..
- ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయి నియంత్రణ
- మహిళలపై జరిగే నేరాలకు శిక్షలు పడే విధంగా చర్యలు
- టాస్క్‌ఫోర్స్ దాడులు పెంచుతాం.. సీసీఎస్‌ను పటిష్టపరుస్తాం..



రామగుండం సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ పౌరులకేనని, సంఘ విద్రోహ శక్తులను ఉపేక్షించేది లేదని, రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శాంతిభద్రతలు పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నాయని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నేరాలకు పాల్పడేవారు ఏ పార్టీ వారైనా, ఏ వర్గం వారైనా తమ దృష్టిలో సమానమేనని, అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంచిర్యాల పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి చర్యలు తీసుకున్నామని, రౌడీ షీట్లు తెరిచామన్నారు. భూ కబ్జాలకు పాల్పడే వారిపై పీడీయాక్టు నమోదు చేస్తామని, ఈ మేరకు జాబితా కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. శాంతి భద్రతల విషయమై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ఆంధ్రజ్యోతి : కమిషరేట్‌లో శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉంది?

సీపీ : చాలా బాగుంది. పూర్తి స్థాయిలో అదుపులో ఉన్నాయి. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లో ప్రశాంతమైన పరిస్థితులు ఉన్నాయి. మంచిర్యాల పట్టణంలో రాజకీయ వివాదాలు సృష్టించుకుంటున్నారు. గతంలో జరిగిన ఒక కేసు విషయంలో యువత పరస్పర దాడులకు పాల్పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఏడుగురిపై రౌడీషీట్లు తెరిచాం. బాధ్యులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చాం.

మిగతా 7లో...

అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్‌రావు, తహసీల్దార్ వనజారెడ్డిని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

జైపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని డీసీపీ భాస్కర్‌రావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఎస్టీపీపీ పీహెచ్‌సీలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సిబ్బంది ప్రజాప్రతినిధులు, యువకులు సుమారు 250 మంది రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణకు ఎంతో మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. రక్తదానం చేయడం సామాజిక సేవ అని, ఆపదలో ఉన్న వారిని కాపాడడానికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 1996లో ఉట్నూరు పోలీస్ స్టేషన్‌పై దాడి ఘటనలో 18 మంది కానిస్టేబుళ్లు మృతి చెందగా అందులో ఒకరైన వెంకట్‌రెడ్డి కానిస్టేబుల్ భార్య వనజారెడ్డి తహసీల్దార్‌గా పనిచేయడంపై సంతోషం వ్యక్తంచేశారు. తహసీల్దార్ వనజారెడ్డిని సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం అమరుల కుటుంబాలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏసీపీ వెంకటేశ్వర్, ఎస్టీపీపీ జీఎం రాజశేఖర్, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్‌అనిల్‌రావు, జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ మహేందర్, సీఐ వేణుచందర్, వైద్యులు ముస్తాఫా, శ్రావ్య, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐశ్రీధర్, శ్వేత పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): ప్రతీ యువకుడు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణం పోసిన వారమవుతామన్నారు. చెన్నూరు, కోటపల్లి, నీల్వాయి పోలీస్‌స్టేషన్‌ల పరిధి పోలీసులతోపాటు పలువురు యువకులు రక్తదానం చేశారు. సీఐలు రవీందర్, సుధాకర్, ఎస్ఐలు సుబ్బారావు, నాగరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



హాజీపూర్ పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

హాజీపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం పీహెచ్‌సీ కేంద్రాన్ని సందర్శించి రిజిష్టర్‌లు, ఆసుపత్రి పరిసరాలు, మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. నర్బేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హాజరు పట్టిక, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వేంపల్లి గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు. ముల్కల్ల పంచాయతీలోని కంపోస్టు షెడ్‌ను సందర్శించి గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టుషెడ్‌కు తరలించి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించారు. ఎంపీడీవో ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో చేపట్టిన సెంట్రల్ డ్రగ్ స్టోర్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం పనులను ఆకస్మికంగా పరిశీలించారు. కలెక్టర్ మాట్లడుతూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా పరిధిలో మందుల పంపిణీకి

విద్యార్థులపై మాదక ద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలి

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌పై మాదక ద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో డీసీపీ భాస్కర్, ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీలు రవికుమార్, వెంకటేశ్వర్, జిల్లా అబ్కారీ మద్యనిషేధ అధికారి నందగోపాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పాఠశాలలలో ప్రహరీ క్లబ్స్ నిర్వహించాలని, ప్రతీ నెల 3వ బుధవారం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనం ద్వారా అవగాహన కల్పించాలన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్లలో పొగాకు ఉత్పత్తులు, మాదక ద్రవ్యాల విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఈవో యాదయ్య, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, వ్యవసాయాధికారి కల్పన, డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ చందన పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

నస్పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం డీసీపీ భాస్కర్ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదయ్యే కేసుల వివరాలను తెలుసుకున్నారు. నిరంతరం నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. సీఐ ఆకుల అశోక్, ఎస్సై నెల్కి నుగుణాకర్, అదనపు ఎస్సై జితేందర్, సిబ్బంది ఉన్నారు.

సరిహద్దు రాష్ట్రాల పోలీసులతో సీపీ సమావేశం



హెలిక్యాప్టర్ ద్వారా సమావేశానికి వెళ్తున్న సీపీ, అధికారులు

మంచిర్యాల అర్బన్/ఆసిఫాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న మహారాష్ట్ర ఎన్నికలనేపథ్యంలో పోలీసులు హైఅలర్ట్ అయ్యారు. తెలంగాణ,మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారుల సమావేశం గురువారం గడ్చిరోలి జిల్లా ఎస్పీ క్యాంపు ఆఫీస్‌లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంకిత్ గోయల్ ఆధ్వర్యంలో జరుగగా రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ హాజరయ్యారు. కమిషనరేట్ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావుతో కలిసి వెళ్లారు. ఎన్నికల దృష్ట్యా మావోయిస్టు కదలికలపై నిరంతర నిఘా, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయా సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మత్తడి పేల్చివేత కేసులో మరొకరి అరెస్టు

చెన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : శనగకుంట చెరువు మత్తడి పేల్చివేత కేసులో మరో నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కేసులో ఇప్పటికే 14 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చామన్నారు. పేల్చివేతకు జిలెటిన్ స్టిక్స్‌ను సరఫరా చేసిన మేదరి సతీష్‌ను అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరు పర్చామన్నారు. మరో నిందితుడు బిర్ల నితీష్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. సీఐ రవీందర్, ఎస్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

కోర్టు పేషీలకు హాజరు కాని ముగ్గురి అరెస్టు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): మూడు వేర్వేరు కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురు కొంత కాలంగా కోర్టు పేషీలకు హాజరు కాకపోవడంతో గురువారం అరెస్ట్ చేశామని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. సీసీసీ నస్పూర్ ఆర్కే-5 ప్రాంతానికి చెందిన తనుగుల నారాయణ, మందమర్రి ప్రాణహిత కాలనీకి చెందిన తీగల శంకర్, సీసీసీ నస్పూర్ గాంధీనగర్‌కు చెందిన పులి తిరుపతిలు మహిళా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. పేషీలకు హాజరు కాకపోవడంతో అరెస్టు చేసి మంచిర్యాల ఫస్ట్ అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఉపనిషద్విని ఎదుట హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

నేరాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

మందమర్రిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌కాల్స్‌తో యువకులకు వలపు వల విసురుతూ మోసం చేస్తున్న మహిళతోపాటు మరో వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొన్ని రోజులుగా గుంటూరుకు చెందిన మహిళతోపాటు ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తి యువకులకు ఫోన్ చేసి మాయమాటలు చెప్పి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. పట్టణంలోని ఓ యువకుడికి మహిళ ఫోన్ చేసి పరిచయం చేసుకుందని, యువకుడిని నమ్మించి రూ. 85 వేలు తీసుకుందని తెలిపారు. మోసపోయానని గ్రహించిన సదరు యువకుడు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడని తెలిపారు. గురువారం మందమర్రిలోని రాష్ట్రీయ రహదారి పక్కన మహిళ, వ్యక్తి ఉండగా వారిని పట్టుకున్నామన్నారు. వీరిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ అజయ్, రాము, మహిళ హోంగార్డు ఉమలను ఏసీపీ అభినందించారు.

ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత

మందమర్రిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత అని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేకే 5 ఫిల్టర్ బెడ్ ఏరియాలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ, బ్యాంకు ఖాతా, ఏటీఎం నెంబర్లు చెప్పవద్దన్నారు. నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ రాజశేఖర్, సర్కిల్ పరిధిలోని పోలీసులు పాల్గొన్నారు.

పాము కాటుతో యువకుడి మృతి



జీవన్‌దాస్(ఫైల్)

బెజ్జూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమినికి చెందిన జంగం జీవన్‌దాస్(22) పాముకాటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. జీవన్‌దాస్ బుధవారం సాయంత్రం పంటచేనులో కలుపు తీస్తుండగా పాముకాటు వేసింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తండ్రి శంకర్ జీవన్‌దాస్‌కు ఫోన్ చేయగా పాము కుట్టిన విషయం చెప్పాడు. తల్లిదండ్రులు వెంటనే అక్కడికి వెళ్లగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. చికిత్స నిమిత్తం మహారాష్ట్రలోని అహిరి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఓపెన్ హౌజ్ కార్యక్రమం

జన్నారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌజ్ నిర్వహించారు. ఎస్ఐ రాజవర్ధన్ విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాల పనితీరు, డయల్ 100, రిసెప్షన్‌లో ఫిర్యాదు, ఫింగర్ ప్రింట్ స్కానర్ తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పాఠశాలకు ప్రింటర్, జిరాక్స్ మిషన్ అందజేత

భీమారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.15 వేల విలువ గల ప్రింటర్ కం జిరాక్స్ మిషన్‌ను బదిలీ అయిన ఉపాధ్యాయురాలు శ్రీలత గురువారం అందించారు. ప్రధానోపాధ్యాయులు విక్రమ్, కైలాస్, ఉపాధ్యాయులు కుమార్ శ్రీలతను అభినందించారు.

రైస్‌మిల్లు యజమాని అరెస్ట్

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాతేశ్వరి ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని దర్శనాల రమేష్ అరెస్ట్ చేసినట్లు తాళ్లగురిజాల సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. అగ్రిమెంటు ప్రకారం ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించిన 3850.20 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని 1-11-2023 నుంచి 14-1-2024 వరకు అధికారులు అప్పగించారు. దర్శనాలరమేష్ మంచిర్యాల పౌరసరఫరాల వారికి ధాన్యం నుంచి 67 శాతం సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 346.797 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించారు. మిగిలిన ధాన్యాన్ని రమేష్ మార్కెట్‌లో విక్రయించాడు.ధాన్యం విలువసుమారు రూ.6,53,57,646 ఉంటుందన్నారు. దీనిపై జిల్లాపౌరసరఫరాలశాఖ మేనేజర్ శ్రీకళ తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడు దర్శనాల రమేష్‌ను గురువారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి

చెన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోదావరి తీర హనుమాన్ ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు గురువారం వినతి పత్రం అందించారు. 15 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మిర్చి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్, రైతులు ఇప్ప చంద్రయ్య,తోట శ్రీనివాస్, సందీప్, నామని బాపు, నీలం లచ్చన్న పాల్గొన్నారు.

శిథిలావస్థలో అతిథి గృహం



సిర్పూర్(టి)లో ఆర్అండ్‌బీ అతిథి గృహం

సిర్పూర్(టి), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో మండల కేంద్రంలో విశ్రాంతి భవనం లేక నాయకులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. నిజాంకాలంలో నిర్మించిన గెస్ట్‌హౌజ్ భవనం శిథిలావస్థకు చేరుకుని పైస్లాబ్ పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది.

పేరుకే సిర్పూర్ నియోజక వర్గమని కనీసం ఒక విశ్రాంతి భవనం సైతం లేక పోవడం చాలా దురదృష్టకరమని ప్రజలు అంటు న్నా రు. ప్రభుత్వం, అధికారులు, నాయకుల సౌకర్యార్థం ఉండాల్సిన భవనం లేకపోవడంతో కొన్నిసందర్భాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు మండలంలో పర్య టించి రాత్రి సమయంలో బసచేయాల్సి వస్తే 20కిలో మీటర్ల దూరంలో ఉన్న కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లి ప్రైవేటు లాడ్జిలలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని సందర్భాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు బసచే యడంతోపాటు సేద తీర్చుకోవడం ప్రెస్‌మీట్‌లు ఇవ్వ డం పార్టీ నాయకులు, అధికారులు మాట్లాడం లాంటి పనులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించ ఇదేస్థలంలో నూతనభవనం మంజూరుకు కృషి చేయాల్సిన అవ సరం ఎంతైనా ఉంది.

ఆహ్లాదాన్ని పంచుతున్న మొక్కలు



సావర్‌ఖేడలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కలు

కెరమెరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సావర్‌ఖేడ గ్రామంలోని ప్రధానరోడ్డు నుంచి యూపీఎస్ పాఠశాలకు వెళ్లే దారికి ఇరువైపులా అయిదు సంవత్సరాలక్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వృక్షాలుగా పెరిగి చూపరులను కనువిందు చేస్తున్నాయి. దీంతో ప్రకృతి ప్రేమికులు మొక్కలు మంచి గాలితోపాటు నీడను అందజేస్తున్నాయని పేర్కొం టున్నారు.

కుమరం భీం వర్ధంతి



వాంకిడిలో పూజలు నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు

వాంకిడి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింబాగూడ గ్రామంలో గురువారం కుమరంభీం వర్ధంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ధ్వజారోహణచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, తుడుందెబ్బ నాయకులు విజయ్, సర్‌మేడి భీంరావు, మాలి సంఘం నాయకులు మెంగాజీ, నాయకులు దీపక్‌ముండే, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి:మండలకేంద్రంలోని ఆదివాసీభవన్‌లో మాజీఎంపీపీ మోతీరాంతో పాటు పలువురు ఆదివాసీసంఘాల నాయకులు భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ద్రుపతాబాయి, రాజేశ్వర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

జైనూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు చట్టాలకు అనుగుణంగా విధులను నిర్వర్తించాలని మండల డిప్యూటీ తహసీల్దార్ ఆడ బీర్‌షావ్‌కు గురువారం రాయిసెంటర్ల సార్మెడీలు, ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఇతర ఆదివాసీ సంఘాలనాయకులు వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగంలోని 5వషెడ్యూల్‌ప్రకారం అధికారులు తమ వృత్తిధర్మాన్ని నిర్వర్తించాలని వారు వినతిపత్రంలో కోరారు. ఆదేవిధంగా ఏజెన్సీలో గిరిజనేతరులకు గృహాలు నిర్మించేందుకు, వ్యాపారం చేసెందుకు లైసెన్సులు ఇవ్వకూడదన్నారు. అధికారులు చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులకు సహకరిస్తే కోర్టును ఆశ్రయి స్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఆడ బీర్షావ్ స్పందించి ఆదివాసుల డిమాండ్లను కలెక్టర్‌కు వివరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మాజీజడ్పీటీసీ కొడప విశంరావ్, ఆదివాసీ సంక్షమపరిషత్ జిల్లా నాయకులు మారుతి, రాయిసెంటర్ల సార్మెడీలు, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ రాజేంద్రప్రసాద్

కాగజ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణ సీఐగా రాజేంద్రప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసి సీఐ శంకరయ్యను హైదరాబాద్‌కు బదిలీచేశారు. ఈ సందర్భంగా నూతనంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అంతా సహకరించాలని కోరారు. అనంతరం డీఎస్పీ రామానుజం, ఏఎస్పీ ప్రభాకర్‌ను కలిసి మొక్కను అందజేశారు. అలాగే సీఐకి పట్టణ ఎస్సైలు దీకొండ రమేష్, సుధాకర్ మొక్కలను అందజేశారు.

మోడల్ గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మోడల్ గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం వంకులం ప్రాథమికోన్నత పాఠశాలలో మోడల్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ లైబ్రరీలో వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయరాణి, మహేశ్వర్, పురుషోత్తం పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఆసిఫాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని టాస్క్ (తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్‌అండ్‌నాలెడ్జ్) భవనంలో జిల్లాఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల26నజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధికల్పన అధికారి సతీష్‌కుమార్ తెలిపారు. అపోలో ఫార్మసీలో 30ఫార్మాసిస్టు, 20ట్రైనీఫార్మాసిస్టు పోస్టుల భర్తీకి ఇంట ర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మిగితా వివరాలకు 9550441888, 9160608476 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆదివాసీ గూడాల్లో దండారి సంబరాలు ప్రారంభం

సిర్పూర్(యు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో గురువారం దండారి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివాసుల సాంప్రదాయం ప్రకారం భోగి పండుగ జరుపుకుని దండారి సంబరాలు ప్రారంభించడం అనవాయితీగా వస్తున్న ఆచారం. దండారి కులదైవానికి ఆదివాసీ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సంబరాల్లో ఉపయోగించే గుస్సాడీ టోపీలతోపాటు ఏత్మాసర్ దైవానికి గ్రామస్థులందరూ కలిసి ఘనంగా మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని పిట్టగూడలో గ్రామస్థులు ఏత్మాసర్ దైవానికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలని ప్రారంభించారు.

పశువైద్య శిబిరం

కౌటాల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెట్టి గ్రామంలో పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, సిబ్బంది ప్రకాష్, భిక్షపతి, శోభన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్/కౌటాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల సాధనకోసం పీఆర్టీయూటీఎస్ సంఘం అధికారప్రతినిధి వంగ మహందర్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, గౌరవఅధ్యక్షుడు నరసింహ చారి అన్నారు. గురువారం వారు ఆసిఫాబాద్, కౌటాలలోని పాఠశాలల్లో ఎమ్మెల్సీఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైన పీఆర్సీడీఏలు, 317బాధితఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, కేజీబీవీ టీచర్ల ఎంటీఎస్, సీపీఎస్‌రద్దు తదితర సమస్యల పరిష్కారానికి బలమైన నాయకత్వం అవసరమని అందుకు పీఆర్టీయూటీఎస్ గెలుపు అనివార్యమని అన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు అనీల్, రవి, రామచందర్, ఎంఎల్‌రాజు, గణపతి, రమేష్, ఎంఈవో హన్మంతు, ప్రధానో పాధ్యాయుడు నారాయణ్‌సింగ్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

డీఏలను విడుదల చేయాలి

దండేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన 5డీఏలను ప్రభుత్వం విడుదల చేయాలని పీఆర్టీయూటీజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు, మండల శాఖ అధ్యక్షకార్యదర్శు ఇప్ప రవి, పానుగంటి లచ్చన్నలు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ డీఏలను చెల్లించాలని, పీఆర్సీని ప్రకటించాలన్నారు. 317లో నష్టపోయిన వారిని స్థానికత ఆధారంగా సొంత జిల్లాలకు పంపాలన్నారు. సర్వీసు రూల్స్ ప్రకటించి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడిగా నల్లెల సంతోష్, కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్, మండల అసోసియేట్ అధ్యక్షుడిగా బొలిశెట్టి బుచ్చన్న, ఉపాధ్యక్షుడిగా జాడి చిన్నయ్య, మహిళ ఉపాధ్యక్షురాలిగా సౌజన్య, కార్యదర్శిగా అజ్మీర శివప్రసాద్, కే కవితలకు చోటు కల్పించారు.

షీటీమ్ అవగాహన

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చెన్నై షాపింగ్‌మాల్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు గురువారం మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై షీటీమ్ ఎస్సై హైమ అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలను ఎవరైనా ఆకతాయిలు ఇబ్బంది పెట్టినా, వేధింపులకు గురి చేసినా షీటీమ్‌కు సమాచారం అందించాలన్నారు. డయల్ 100 లేదా 6303923700కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. శ్రావణ్‌కుమార్, సతీష్, జ్యోతి పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన

బెల్లంపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 22వ వార్డు కౌన్సిలర్ గడ్డం అశోక్‌గౌడ్ మున్సిపల్ ఏఈ సందీప్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశాడని గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఏఈ సందీప్ మాట్లాడుతూ కౌన్సిలర్ అశోక్‌గౌడ్ మున్సిపల్, కౌన్సిలర్ వాట్సాప్ గ్రూపులో శవాలపై డబ్బులు ఏరుకుంటారని పోస్టు చేశారన్నారు. ఇందుకు నిరసన చేపట్టామన్నారు. అనంతరం ఏసీపీ రవికుమార్‌కు కౌన్సిలర్ అశోక్‌గౌడ్‌పై ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఈ ప్రసాద్, ఆర్వో ప్రవీణ్, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

భీమారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్‌లో వేరుశనగ పంటను మండల వ్యవసాయాధికారి సుధాకర్ పరిశీలించారు. విత్తనశుద్ధి, సాగులో మెలకువలు పాటించాలని రైతులకు సూచించారు. కాజీపల్లి గ్రామంలో వరి పంటను పరిశీలించి దోమపోటు గుర్తించి రైతులకు నివారణ సూచనలను తెలియజేశారు. ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు రాజబాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పఠన సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

హాజీపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పఠన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల చేత పాఠాలను చదివించి పఠన సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు హాజరై క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మాజీ ఎమ్మెల్యే పేరు పెట్టాలి

బెల్లంపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ పేరు పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు. గురువారం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గానికి మొట్టమొదటి ఎమ్మెల్యే గుండా మల్లేష్ అని, నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలందించారన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు గుండా మల్లేష్ పేరు పెట్టాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, జోగుల మల్లయ్య, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు రాజమౌళి, పౌలు, పోచన్న, లక్ష్మీనారాయణ, చంద్రమాణిక్యం, ఉపేందర్, మహేందర్‌రెడ్డి, రామన్న, మహేష్,రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.



మహిళలు ఎంచుకున్న ఉద్యోగాలకు శిక్షణ అందిస్తాం

మందమర్రి టౌన్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు సర్ఫేస్‌లోని వివిధ వృత్తులకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న తెలిపారు. గురువారం మహిళా ఉద్యోగులకు ఆయావృత్తులకు సంబంధించి క్వొలింగ్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ మధ్య కాలంలో సింగరేణిలో మహిళా ఉద్యోగుల నియామకాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి భవిష్యత్‌కు సంబంధించి సర్ఫేస్‌లో ఆయా విధుల వృత్తులకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

ఆసక్తిగల మహిళలు అందరు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవానలి తెలిపారు. సంస్థ మహిళా సంక్షేమం సాధికారతే ధ్యేయంగా ముందుకెళ్తుందని అన్నారు. సింగరేణిలో మహిళలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జయవాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి కేటాయించిన క్వార్టర్లకు తరలివెళ్లాలి

జైపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రామారావుపేట పంచాయతీపరిధిలోని గుత్తదారిపల్లిలో నివాసం ఉంటున్న ఓపెన్‌కాస్టు ప్రభావితగ్రామాల ప్రజలు సింగరేణి యాజమాన్యం కేటాయించిన ఆర్కే5 క్వార్టర్స్‌లోకి తరలివెళ్లాలని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. గురువారం గుత్తదారిపల్లి గ్రామాన్ని అధికారులతో కలిసి సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. గుత్తదారిపల్లె గ్రామస్థులు 11సంవత్సరాల కంటే ముందే నష్టపరిహారం పొంది ఉన్నందున త్వరగా నివాసాలను ఖాళీచేయాలని ఆమె సూచించారు. ఓపెన్‌కాస్టు సమీపంలో నివాసాలు ఉన్నందున ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, జైపూర్ రెండవ ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్పీ1 ఉద్యోగులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్పీ1గనిలో పనిచేస్తూ విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు గురువారం మేనేజర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 2024వార్షిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు 70 కన్నా తక్కువ మస్టర్లు చేసిన ఉద్యోగులను గైర్హాజరుకు గల కారణాలు మేనేజర్ విజయ్‌కుమార్ తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కంపెనీ పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, గైర్హాజరు అయ్యే వారిని ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. తరచుగా నాగాలు చేసే ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తారని, డిస్మిస్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గని సంక్షేమాధికారి సాధన్, పిట్ ఆఫీస్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ మజ్దూర్ ఉద్యోగులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సర్ఫేస్ జనరల్‌మజ్దూర్ పోస్టులకోసం గురువారం జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనారోగ్య సమస్యలున్న వారికి పదిఖాళీలుండగా, వారికి ఎస్‌వోటు జీఎం ఎస్ సత్యనారాయణ కౌన్సెలింగ్ ప్రారంభించారు. వారి మెడికల్‌రిపోర్టులను కమిటీసభ్యులు పరిశీలించారు. 139 మందికిగాను 99మంది హాజరయ్యారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) కె. చిరంజీవులు, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్‌సమీరా సంధాని, సీనియర్ అసిస్టెంట్ కె శ్రీధర్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

గర్మిళ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణానికి చెందిన గడేవార్ గజానన్-రూప దంపతుల కూతురు జాగృతి బ్లడ్‌కేన్సర్‌తో బాధపడుతోంది. జాగృతి అభ్యాస పాఠశాలలో 4వతరగతి చదువుతోంది. విషయం తెలుసుకున్న ఆదిత్యఎన్‌క్లేవ్ మా షటిల్‌టీం సభ్యులు గురువారం రూ. 30 వేల చెక్కును బాలిక తల్లిదండ్రులకు అందించారు. సభ్యులు మాట్లాడుతూ నాగ్‌పూర్‌లోని నేషనల్ కేన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని, ఇప్పటివరకు రూ.9లక్షలు ఖర్చుకాగా, ఇంకా రూ.6లక్షలు అవసరం ఉందన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలి

గర్మిళ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని గురువారం భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. బీమాకు సంబంధించి లేబర్ కార్డుల ఆన్‌లైన్ పునరుద్దరించాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. సూరన్న, రామన్న,చంద్రయ్య, రాజు, మల్లేష్, కోటన్న పాల్గొన్నారు.

అల్లీనగర్ అటవీ సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్

జన్నారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జన్నారం రేంజ్ పరిధిలోని అల్లీనగర్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కిరణ్మైజ్యోతి విధుల్లో నిర్లక్ష్యం వహించారనే అభియోగం మేరకు సస్పెండ్ చేశారు. ఈ నెల 9న అల్లీనగర్ గ్రామానికి చెందిన ఆత్రం నగేష్ ఇంట్లో రూ.54 వేల విలువ గల టేకు కలపను పట్టుకున్నారు. కలపను పట్టుకున్న వ్యవహారంలో పలు ఆరోపణలు రావడంతో మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ రమాదేవిని ఉన్నతాధికారులు విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నివేదిక ఆధారంగా సెక్షన్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినట్లు డీఎఫ్‌వో స్థానిక ఇన్‌చార్జీ ఎఫ్‌డీవో శివ్‌ఆశిష్‌సింగ్ తెలిపారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

బెల్లంపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి నియోజక వర్గంలోని స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామునాయక్ అన్నారు. గురువారం దళిత సంఘాల ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో ఫుడ్‌జోన్, సోలార్ ప్లాంట్ , వివిధ బొగ్గు పరిశ్రమల్లో స్థానికులకు ఎమ్మెల్యే ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. బెల్లంపల్లిలో సోలార్ ప్లాంటు ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే వినోద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాజేష్, రత్నం ఐలయ్య, దుర్గం గోపాల్ పాల్గొన్నారు.

కార్మికవాడ నుంచి.. చిత్రనగరికి



- షార్ట్‌ఫిలిం, సీరియళ్లకు దర్శకత్వం వహిస్తున్న తిరుపతి
- సింగరేణి ఉద్యోగాన్ని వదిలి సినీ పరిశ్రమ వైపు
- స్థానిక కళాకారులకు అవకాశం

నస్పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పలు షార్టుఫిలింలు నిర్మించి, టీవీ సీరియళ్లకు దర్శకత్వం వహించిన తిరుపతి, బుల్లి తెరమీదనే కాక వెండి తెర మీద కూడా రాణిస్తున్నారు. మందమర్రి ఏరియాలో సింగరేణి కార్మికుడిగా ఒకప్పుడు పనిచేసిన ఆయన సరిగా విధులకు హాజరు కావడంలేదని సింగరేణి యాజ మాన్యం డిస్మిస్ చేసింది. దానికి ఆయన ఏమీ కుంగి పోలేదు. తనకు ఇష్టమైన కళా రంగంవైపు దృష్టి సారించి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు.



షూటింగ్‌లో సన్నివేశాన్ని వివరిస్తున్న కర్రె తిరుపతి

తిరుపతి దర్శకత్వం వహించిన చిత్రాలు, సీరియళ్ళు ప్రజాదరణ పొందాయి. 1997 నుంచి 2000 వరకు 117 షార్ట్‌పిల్మింలు తీశారు. అంతే కాకుండా 2004లో అదృశ్యం సినిమా ద్వారా తొలిసారిగా దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. ఇప్పటివరకు ఐదు సినిమాలు, 14 సీరియళ్ళకు దర్శకత్వం వహించారు.

● అంచెలంచెలుగా...

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన కర్రె రాజయ్య-వీరమ్మ దంపతుల కుమారుడు తిరుపతి. తల్లిదండ్రులు సింగరేణి ఉద్యోగ రీత్యా కోల్‌బెల్ట్ ప్రాంతమైన మందమర్రికి వచ్చారు. ప్రస్తుతం మంచిర్యాల పట్టణం హమాలివాడలో స్థిరపడ్డారు. విద్యార్థి దశలోనే సినిమాలకు ఆకర్షితుడయ్యాడు. తండ్రి వారసత్వంగా వచ్చిన ఉద్యోగంలో చేరిన తిరుపతి 1993 నుంచి 1998 వరకు ఆర్కే-1ఏ పని చేశాడు. షూటింగ్‌లకు సమయం కేటాయించడంతో మస్టర్లు నిండకపోవడంతో యాజమాన్యం డిస్మిస్ చేసింది. ఉద్యోగాన్ని వదిలిపెట్టి సినీ ప్రపంచంలోనే ఉండిపోయాడు. అవకాశాలు వచ్చినప్పుడల్లా సినిమాలు తీస్తూ కళాకారులను వెండి తెరకు పరిచయం చేస్తున్నాడు.



రుద్రనేత్రి షూటింగ్‌లో సన్నివేశాన్ని వివరిస్తున్న కర్రె తిరుపతి

● మిత్రుల సహకారంతో

మిత్రుల సహాయ సహకారాలతో సందేశాత్మక, మహిళరక్షణ, నేరాల అదుపు, దొరల దోపిడి వ్యవస్థ, హాస్యం ఇలా ఎన్నో ప్రధానాంశాలతో కూడిన చిత్రాలు, సీరియ ళ్ళను రూపొందించారు. 2004లో అదృశ్యం, 2009లో సైకో..6 ఏఎంటు 6పీఎం, 2014లో అహానా ప్రేమంటా.. చిత్రాలను నిర్మించారు. 2018లో రుద్రనేత్రి చిత్రాన్ని జిల్లా కళాకారులచే నిర్మించారు. ఈ సినిమా 2022లో విడుదలైంది. ఏ చిత్రంలోనైనా స్థానిక కళాకారులకు ప్రాధాన్యం కల్పించడం వలన తిరుపతికి గుర్తింపు లభించింది. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సినీరంగంలో రాణిస్తున్నాడు.

స్థానిక కళాకారులకు అవకాశాలు...



ఈ ప్రాంత కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో చాలా మందిని నేను తీసే సినిమాల్లో అవకాశాలు కల్పించి వెండి తెరకు పరిచయం చేసాను. రానున్న సినిమాల్లో కూడా స్థానికులకే ప్రాధాన్యం కల్పిస్తా. తాను రూపొందించే సినిమాలు ఎక్కువ శాతం ఈ ప్రాంతంలోనే షూటింగ్ చేస్తున్నా.

- కర్రె తిరుపతి, సినీదర్శకుడు-మంచిర్యాల

28న గుస్సాడీ దర్బార్

దండేపల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): గుడిరేవు గోదావరి ఒడ్డున గల పద్మల్ పూరీ కాకో ఏత్మాసార్ ఆలయంలో ఈనెల28 మధ్యాహ్నం గుస్సాడీదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుడిమేత సోము, గోండ్వానారాయిసెంటర్ మండల అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. సోమవారం నిర్వహించే గుస్సాడీ దర్బార్‌కు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు. ఆదివాసీలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. దర్బార్ పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. లింగాపూర్ నుంచి ఆలయంవరకు రోడ్డుపైఉన్న గుంతలకు మరమ్మతు చేపట్టారు. త్రిమూర్తి, దుర్గప్రసాద్, రమణ, నవీన్, రాకేష్ పాల్గొన్నారు.

సత్యదేవుడిని దర్శించుకున్న పీఠాధిపతి

దండేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి సత్యదేవుడిని దర్శించుకొన్నారు. ఆలయ అధికారులు, అర్చకులు పీఠాధిపతికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. స్వామిదర్శనం అనంతరం సత్యనారాయణ స్వామిలీలా విలాసం ప్రవచనలు గావించారు. ప్రవచనలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం పీఠాధిపతిని ఈవో సంకటాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామిలు సన్మానించారు. పండితులు దుద్దిళ్ల నారాయణశర్మ, అర్చకులు గోవర్ధన సంపత్‌స్వామి, సురేష్‌స్వామి, రామకృష్ణ, పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని శ్రీ విశ్వనాథ దేవాలయాన్ని బాల బ్రహ్మానందసరస్వతి నైమిశారణ్య పీఠాధిపతులు దర్శించుకున్నా రు. ఆయనకు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



పీఠాదిపతిబ్రహ్మానంద సరస్వతికి ఘన స్వాగతం

ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు. ఆలయ ఈవో ముక్తరవి, ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనభట్టాచార్యులు, సంఘటనభట్ల నరహరిశర్మ, బాలకృష్ణ శర్మ, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి ధమాకా

(5వ పేజీ తరువాయి)

దీపావళి బోనస్ తొలిసారిగా సింగరేణిలో 1964 నుంచి అమల్లోకి వచ్చింది. బోనస్ రావడానికి కారణం ఏఐటీయూసీ కృషి ఉండగా, 1964లో అప్పటి యూనియన్ అధ్యక్షుడు విఠల్‌రావు చొరవతో యాజమాన్యం బోనస్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఒక్క సింగరేణిలోనే బోనస్ అమలుకాగా 1965లో చట్టం వచ్చిన తరువాత అన్ని కంపెనీల్లో కార్మికులకు బోనస్ అందుతోంది.

గుర్తింపు యూనియన్ కృషితోనే...



సింగరేణి కార్మికులకు యాజమాన్యం దీపావళి బోనస్ పెంచడానికి గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ కృషి ఎంతో ఉంది. కార్మికులకు బోనస్ పెంచాలని యాజమా న్యాన్ని కోరడంతోనే గతేడాదితో పోల్చితే రూ.8వేల పైచిలుకు పెరిగింది.

- ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

ప్రభుత్వానికి కృతజ్ఞతలు...



సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. యూనియన్ తరుపున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమా ర్కను కలిసి విన్నవించడంతో శుక్రవారం బోనస్ జమ చేసేందుకు మార్గం సుగమమైంది.

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్

సాధారణ పౌరులకే 'ఫ్రెండ్లీ పోలీసింగ్'..

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి : ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీస్ శాఖలో ఉదాసీనత పెంచిందా..?

సీపీ : ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ పౌరులకే. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. వారికి పోలీస్ తరహా కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : కమిషనరేట్‌లో పీడీ యాక్టులు నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. నిజమేనా..?

సీపీ : ఇది వాస్తవమే. పీడీ యాక్టులకు సంబంధించి విధానం ఉంది. పకడ్బందీగా నమోదు చేయకపోతే నేరస్థులు అప్పీలుకు వెళ్లి బయటకు వస్తున్నారు. అక్రమదందాలకు పాల్పడే వారు, గంజయి స్మగ్లర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం. భూకబ్జాలకు పాల్పడే వారిపై తప్పకుండా పీడీ యాక్టులు నమోదు చేస్తాం. జాబితా కూడా సిద్ధమైంది. నేరాలకు పాల్పడేవారు కాదు, వారిని ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : శాంతి భద్రతల పరిరక్షణలో రాజకీయ జోక్యం పెరిగిందా?

సీపీ : శాంతిభద్రతల పరిరక్షణలో రాజకీయాలకు ఏమాత్రం చోటు లేదు. ఏ పార్టీ వారైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. చెన్నూరులో చెరువు మత్తడి పేల్చిన ఘటనలో అధికార పార్టీ కౌన్సిలర్‌తో పాటు బీఆర్ ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశాం. వాహనాలను సీజ్ చేశాం. కాల్ రికార్డులు తీసి ఈ ఘటనతో సంబంధం ఉన్న అందరినీ అరెస్టు చేశాం.

ఆంధ్రజ్యోతి : అక్రమ దందాలపై మీ వైఖరి ఏమిటి?

సీపీ : రామగుండం కమిషనరేట్‌లో గంజాయి, పేకాట, బియ్యం, ఇసుక అక్రమరవాణా, అక్రమ ఫైనాన్స్‌లపై కఠిన వైఖరి అవలంబిస్తున్నాం. ఆంధ్రనుంచి డబ్బులు తీసుకువచ్చి అక్రమ ఫైనాన్స్‌లు నడుపుతున్నారు. ఇక్కడ ఏజెంట్లను పెట్టి 10శాతం చొప్పున వడ్డీలకు ఇస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేశాం. ఇక్కడ చిరు వ్యాపా రులు, కూలీలు, సింగరేణి కార్మికుల వద్ద నుంచి పెద్ద ఎత్తున వడ్డీలు వసూలు చేస్తున్నారు. 23కేసులు నమోదు చేసి 25మందిని అరెస్టు చేశాం. 60 గంజాయి కేసుల్లో 43కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. 170మం దిని అరెస్టు చేశాం. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై 105కేసులు నమోదు చేసి 160మందిని అరెస్టు చేశాం. ఇసుక అక్రమ రవాణాపై 94కేసులు నమోదు చేసి యంత్రాలు సీజ్ చేసి 212మందిని అరెస్టు చేశాం.

ఆంధ్రజ్యోతి : గంజాయి నియంత్రణకు చర్యలేవి..?

సీపీ : పల్లెలు, పట్టణాలు అనే తేడాల లేకుండా గం జాయి మహమ్మారి చొచ్చుకుపోయింది. గంజాయిని కట్టడి చేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాం. రవాణాకు సంబంధించిన లింకులు కట్ చేశాం. గంజాయికి బానిస అయిన వారు చందాలు పోగు చేసుకుని మహారాష్ట్ర, ఒరిస్సా బార్డర్‌కు వెళ్లి గంజాయి తెచ్చుకుం టున్నారు. గంజాయి నియంత్రణలో తల్లిదండ్రుల పాత్రే కీలకం. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ మహమ్మారిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : జూదం, పేకాట నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీపీ : జూదం విషయంలో ఎవరికి మినహాయింపు లేదు. పెద్దపల్లి, మంచిర్యాల వంటి ప్రాంతాల్లో అధికారుల క్లబ్‌ల్లో కూడా జూదానికి అనుమతించడం లేదు. మంచిర్యాలలో లాడ్జిలనే సీజ్ చేశాం. ఒక అటవీ ప్రాంతంలో పేకాట నడుస్తోందని సమాచారం వస్తే టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మారువేషాల్లో వెళ్లి ఆపరేషన్ చేశారు. జూదం, వ్యభిచారం ఎక్కడ జరిగినా సంబంధిత లాడ్జి లను సీజ్ చేస్తాం.

ఆంధ్రజ్యోతి : టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ పనితీరు ఎలా ఉంది. ఎమైనా సిబ్బంది కొరత ఉందా?

సీపీ : సిబ్బంది కొరతతో టాస్క్‌ఫోర్స్ దాడులు తగ్గా యి. ఇప్పుడు పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారు. అక్రమ దందాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు ఉధృతం చేస్తాం. సీసీ ఎస్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోయాం. ప్రస్తుతం జరుగుతున్న నేర పరిశోధనలో సీసీఎస్ భాగస్వామ్యం ఉంది. మరింతగా వినియోగించుకుంటాం.

ఆంధ్రజ్యోతి : శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుం టున్న ప్రత్యేక చర్యలేంటి?

సీపీ : మావోయిస్టులను పూర్తిస్థాయిలో కట్టడిచేశాం. ప్రత్యేక కూంబింగ్ జరుగుతోంది. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమా న్ని చేపట్టాం. ఎస్ఐ నుంచి సీపీ వరకు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. డ్రోన్ పెట్రోలింగ్ కార్య క్రమాన్ని చేపట్టబోతున్నాం. మొదటి దశలో పట్టణ ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ ఉంటుంది. గణేష్ నిమజ్జనం, బక్రీద్ వంటి పండుగలకు ఈ డ్రోన్ సేవలను వినియోగించు కున్నాం. 'ఆపరేషన్ గరుడ'ను మరింత విస్తరిస్తాం.


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలో ఈ నెల 23న జరిగిన అండర్-19 కబడ్డీ పోటీల్లో మంచిర్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బుచ్చన్న తెలి పారు. బాలుర విభాగంలో ఎండి.అసద్, ఏ.శ్రీమాన్, బాలికల విభా గంలో టి.వైష్ణవి, సిహెచ్.సింధు, కె.వేణుప్రియలు ఎంపికయ్యారని, వీరు మహబూబ్‌నగర్ జిల్లాలో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పీడీ సుధీప్, అధ్యాపకులు అభినందించారు.

కబడ్డీ ఎంపిక పోటీలు



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

బెల్లంపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జోనల్ స్థాయి అండర్ 19 ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. 100 మందికి పైగా బాలబాలికలు పాల్గొన్నారు. రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ మాట్లాడుతూ నేటి సమాజంలో క్రీడలు చాలా అవసర మని, క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అం డర్ 19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబురావు మాట్లాడుతూ ఇక్కడ ఎం పికైన వారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావా లన్నారు. జోనల్ ఆఫీసర్ అరుణకుమారి, పీఈటీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వేణుగోపాల్, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రావణ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ ఏరియా, గోసేవా మండల్, రాం నగర్, కాలేజీరోడ్డు, ఎల్ఐసీకాలనీ, పాతమంచిర్యాల, చింతపండువాడ, రెడ్డికాలనీ, సంజీవయ్యకాలనీ, ఎడ్లవాడ, ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

అన్ని వార్డుల అభివృద్ధికి చర్యలు

మందమర్రి టౌన్, అక్టోబరు 24: మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదేశాలతో అభివృద్ధి పనులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరుకోట్లతో రోడ్లు, డ్రైన్ పనులను ప్రారంభించారన్నారు. జయశంకర్ చౌరస్తా నుంచి రామన్ కాలనీ రాజన్నలవాడ రైల్వే బ్రిడ్జి వరకు రూ.2 కోట్ల 21 లక్షలతో డ్రైన్ పనులు చేపట్టామన్నారు.

ఘనంగా అనగాష్టమి వ్రతాలు

గర్మిళ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోదావరి తీరంలో గల గౌతమేశ్వరాలయంలో గురువారం సామూహిక అనగాష్టమి వ్రతాలను నిర్వహించారు. నీల రమాదేవిరవీందర్ దంపతులు అన్న ప్రసాదాలను అందజేశారు. ప్రతినెల అష్టమి రోజున గౌతమేశ్వరాలయంలో జరుగుతున్న అనగాష్టమి వ్రతాల్లో పలు ప్రాంతాల నుంచి భక్తులు హాజరవుతున్నారని ఆలయఫౌండర్ శ్రీదేవి తెలిపారు. ప్రోగ్రాం చైర్మన్ శ్రీనివాస్, వాసవీక్లబ్ క్యాబినెట్ ట్రెజరర్ కేశెట్టి వంశీకృష్ణ, హెడ్‌మాస్టర్ రాజు, భక్తులు పాల్గొన్నారు.



వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఉన్నత చదువులు చదివి స్వయం ఉపాధి వైపు

- సొంత వ్యాపారాల్లో రాణిస్తున్న యువత
- అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు

కాగజ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగ అవకాశాల్లో పోటీతో ఉన్నత చదువులు చదివిన యువత స్వయం ఉపాధి వైపు మొగ్గుచూపుతున్నారు. డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్, డీటీపీ సెంటర్ తదితర వాటితో చక్కటి ఉపాధి పొందుతున్నారు. వ్యాపారాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు కాగజ్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు.



● కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కాసుల సుధీర్ హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగం చేసేవాడు. నెల కు రూ.35వేల జీతం వచ్చేది. పని ఒత్తిడి అధికంగా ఉండటంతోనే స్వయం ఉపాధివైపు అడుగులు వేశాడు. జీఎస్టీ, సీఎస్సీ సెంటర్‌ను ప్రారంభించాడు. ప్రసుతం ఎలాంటి ఒత్తిడి లేకుండా హాయిగా జీవిస్తున్నాడు. రోజుకు రూ.1000 నుంచి రూ.2000 వరకు సంపాదిస్తున్నాడు. ఒకరికి కింద పనిచేసే భావన ఉండదని, సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉంటుందని పేర్కొంటున్నాడు.



● ఎంఏ ఎకనామిక్స్ పూర్తిచేసిన కె.చంద్రశేఖర్ డీటీపీ సెంటర్ నడిపిస్తున్నాడు. డీటీపీ సెంటర్‌లో క్షణం తీరిక లేకుండా బిజీగా గడు పుతున్నాడు. ఎంత ఎక్కువ పనిచేస్తే అంత ఆదాయం వస్తుందంటున్నాడు. రోజుకు రూ. 1000నుంచి రూ.1500 వరకు సంపాదిస్తున్నాడు.



బట్టల దుకాణాన్ని నిర్వహిస్తున్న అబ్దుల్ మోహిజ్

● బీకాం చేసిన అబ్దుల్ మోహిజ్ బట్టల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. టీ షర్ట్, జీన్స్ రకరకాల డిజైన్స్‌వి తెచ్చి విక్రయిస్తున్నాడు. ప్రధానంగా కాలేజీ యువత దృష్టిలో ఉంచుకుని వివిధ డిజైన్స్‌లో చౌకధరలో ఉండే బట్టలను తెచ్చి విక్రయిస్తున్నాడు. మార్కెట్ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నాడు. రోజకు రూ.1000నుంచి రూ.2000 వరకు సంపాదిస్తున్నాడు.

● బీఏ చేస్తున్న కుదుక వెంకటేష్ మిల్లెట్ వ్యాపారం చేస్తున్నాడు. ప్రస్తుత రోజుల్లో అందరూ ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నారు. తను పెట్టిన సెంటర్‌లో రాగి, జొన్న, అంబలి జావ విక్రయిస్తున్నాడు. ఉదయం ఆరు నుంచి 9గంటల వరకు దుకాణాన్ని నడిపిస్తున్నాడు. పట్టణంలోని యువకులు, వృద్ధులు, వాకర్స్ కొనుగోలు చేస్తున్నారు. రోజుకు రూ.500నుంచి రూ.1000వరకు సంపాదిస్తున్నాడు.



మిల్లెట్స్ సెంటర్‌ను నిర్వహిస్తున్న కుదుక వెంకటేష్

ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలి

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం కన్నాల పంచాయతీ పరిధిలోని తిరుమల హిల్స్‌లో ఆయన పర్యటించారు. గడువులోగా దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని కార్యదర్శులకు సూచించారు. 489 దరఖాస్తులకు 109 దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాల్సి ఉందని, ఇతరులకు విక్రయించడంతో కొనుగోలు చేసిన వారి వివరాలు దొరకడం లేదన్నారు. అందుబాటులో ఉన్న వారిని ఆన్‌లైన్ చేసి మిగిలిన వారికి ఈసీ పరిశీలించి కొనుగోలుదారుల వివరాలు తెలుసుకోవా లని సూచించారు. చాకెపల్లిలో పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రోజు పారిశుధ్య పనులను చేపట్టాలని సూచించారు. మండల పంచాయతీ అధికారి వేదాల శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

108 సిబ్బంది శిక్షణ తరగతులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు ఆసుపత్రి ఆవరణలో 108 రాష్ట్ర ప్రధాన కార్యాలయం అధికారులు గజేందర్, లింగా చారిలు పైలెట్, ఈఎంటీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పరికరాలు ఆన్‌లైన్ నమోదుపై సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఈఎంటీ శహబాజ్, పైలెట్ గంగన్నలకు ఉత్తమ సేవలందించినందుకు 108 వాహనాల ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వామాత్ ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో మంచిర్యాల, కుమరంభీంఆసిఫాబాద్ జిల్లాల్లో పనిచేస్తున్న పైలెట్లు, ఈఎంటీలు పాల్గొన్నారు.



సరిహద్దుల్లోకి మళ్లీ గజరాజు

జిల్లా అధికారులను అప్రమత్తం చేసిన మహారాష్ట్ర అటవీ అధికారులు

పెంచికలపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం మరోసారి ఉలిక్కిపడింది. ఆరునెలల కిందట జిల్లాలో ఇద్దరు రైతులను హతమార్చి వెళ్లిన ఏనుగు తాజాగా దాని కదిలికలతో సరిహద్దు ప్రాంతంలో మళ్లీ కలవరం రేపుతోంది. మహారాష్ట్రలోని గడ్చిరోలి అటవీప్రాంతంలో ఏనుగు కదిలికలను అక్కడి అటవీ అధికారులు గుర్తించి జిల్లా అధికారులకు సమాచారం చేరవేశారు.

గతంలో ఇద్దరు రైతులను హతమార్చిన ఏనుగు..

గత ఏప్రిల్‌లో మహారాష్ట్ర మీదుగా జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగు ఏప్రిల్ 3న చింతలమానేపల్లి మండలం బాబాపూర్ గ్రామంలో వ్యవసాయ పనుల్లో నిమగ్న మైన రైతు అల్లూరి శంకర్‌పై దాడిచేసి హతమార్చింది. మరుసటి రోజు ఏప్రిల్ 4న పెంచికలపేట మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కారుపోశన్న అనే రైతు వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్తున్న క్రమంలో దాడికి పాల్పడి కాలుతో తొక్కి హతమార్చింది. దీంతో అటవీప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటనలతో ప్రజలతోపాటు అటవీ అధికారులకు కంటిమీద కునుకులేకుండా చేసింది.

ఈ ఏనుగును సరిహద్దులు దాటించేందుకు అధికారులు నానాతంటాలు పడ్డారు. డ్రోన్ కెమెరాల ద్వారా ఏనుగును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘాతో ఏనుగు కదిలికలను పసిగట్టారు. ఈ క్రమంలో పెంచికలేట అటవీప్రాంతం నుంచి ప్రాణహితనది మీదుగా మహా రాష్ట్రకు తరలివెళ్లింది. అక్కడ చిన్న వాత్రాల మత్స్యకారుడి వంట గుడిసెని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే.


పెంచికలపేట అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగు (ఫైల్)

మళ్లీ గడ్చిరోలిలో ఏనుగు కదలికలు..

మహారాష్ట్ర రాష్ట్రంలోని గడ్చిరోలి అటవీప్రాంతంలో ఏనుగు సంచరిస్తున్నట్లు సమాచారం. సరిహద్దు ప్రాంతం కావడంతో ఏనుగు మళ్లీ ఇటు వస్తుందా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. దీంతో జిల్లాలోని పెంచికలపేట, బెజ్జూరు, చింతలమానేపల్లి మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అప్రమత్తమైన అధికారులు..

ఏనుగు కదిలికల నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం కాగజ్‌నగర్ అటవీ సబ్‌డివిజన్‌పరిధిలో అధికారులతో ఉన్నతాధికా రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. ప్రజలకు ఈ విషయమై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అటవీశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, అక్టోబరు 24: జిల్లాలో ఇసుక అక్రమరవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, గ్రామీణ నీటి పారుదల, రవాణా, పంచాయతీరాజ్, మైనింగ్, భూగర్భ జలాల శాఖలతో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వాగులు, నదుల నుంచి ఇసుక అక్రమరవాణాను అరికట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పేదవారు ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వం చేపట్టే పనులకుమాత్రమే ఇసుకరవాణా చేయాలన్నారు. జిల్లాలో పది మండలాల్లోని గ్రామాల్లో ఇసుక లభ్యం అవుతుందని తెలిపారు. ఈ క్రమంలో సాయంత్రం 6నుంచి ఇసుకరవాణా చేయడం నిబంధనల ప్రకారం నేరమన్నారు. ఈసమయంలో విస్తృతతనిఖీలు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్‌చేయాలని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, పంచాయ తీరాజ్‌శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పెద్దవంతెనలు, డ్యాములు, చెరువుల వద్ద 500మీటర్లలోపు తవ్వకాలు చేసినట్లయితే చర్యలు తీసుకోవాలన్నారు. రెబ్బెన, సిర్పూర్ (టి), వాంకిడి, ఆసిఫాబాద్‌లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలని తెలిపారు. ఇసుకడంప్‌లను స్వాధీనం చేసుకొని బహిరంగవేలం వేయాలని, అనుమతిలేని వాహనాలు ఇసుక తరలిస్తే జరిమానా విధించాలని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ సహాయసంచాలకుడు గంగాధర్, డీఎల్‌పీవో ఖమర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ గురువారం ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఎంవీ రమేష్ తీర్పు వెల్లడించినట్లు టౌన్‌సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. నగనూరి అశోక్‌కు మార్ మారుతీనగర్‌లో ఒక మహిళ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఇంటి యజమానురాలిని పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా వాడుకొని పెళ్లికి నిరాకరించాడు. దీంతో సదరు మహిళ 2019డిసెంబరు 21న పోలీసుస్టేషన్ లో ఫిర్యాదుచేసింది. అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మోహన్ నిందితుడు అశోక్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్, కోర్టు కానిస్టేబుల్ బాబాజీ కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టగా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ జగన్ మోహన్‌రావు వాదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకేజీతో ఇల్లు దగ్ధం

బెజ్జూరు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంపెలవెంకటేష్ ఇంట్లో గురువారం తల్లిలక్ష్మి వంటచేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ లీక్‌కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్నవారంతా భయపడి కేకలు వేస్తూ బయటకు పరుగెత్తగా ఇరుగుపొరుగు వారువచ్చి మంటలు ఆర్పేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లోని నిత్యావసర వస్తువులు, ఇతరసామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు లక్షన్నర ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. తహసీల్దార్ భూమేశ్వర్, ఆర్ఐ అచ్యుతరావు పరిశీలించారు.

కాలభైరవ స్వామికి పూజలు

రెబ్బెన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామంలోని శ్రీ కనకదుర్గా మహంకాళి ఆలయంలో గురువారం కాలభైరవస్వామికి భక్తులు పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి


రక్తదాన శిబిరాన్ని సందర్శిస్తున్న ఏఎస్పీ ప్రభాకర్‌రావు

ఆసిఫాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఏఎస్పీ ఆర్ ప్రభాకర్‌రావు అన్నారు. పోలీసులఅమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏఆర్‌హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా యువ కులు 51యూనిట్ల రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహలు వద్దన్నారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసులను, యువకులను, విద్యార్థులను ఏఎస్పీ అభినందించి ఫ్రూట్స్, సర్టిఫికేట్స్ అందించారు. ఈ శిబిరంలో సేవలందించిన ఆసిఫాబాద్ ఆసుప్రతి వైద్యసిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రామానుజం, సీఐలు, ఎస్సైలు, ఆసుపత్రిసిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

తిర్యాణి: మండలకేంద్రంలో ఎస్సై మాదవ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసు అమరవీరులత్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

కౌటాల: మండలకేంద్రంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో గురువారం ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పలువిషయాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


తిర్యాణిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, యువకులు


కౌటాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మధుకర్

న్యూస్ బాక్స్

28న ప్రజాభిప్రాయ సేకరణ

ఆసిఫాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ఈనెల28న జిల్లాకేంద్రంలోని జిల్లాపరిషత్ సమావేశమందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్ ఒకప్రకటనలో తెలిపారు. స్థానికసంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ దామాషాను పేర్కొనే విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని ఆసక్తిగల వ్యక్తులు, పార్టీల నుంచి సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను ఆహ్వానిస్తు న్నామన్నారు. అభ్యర్థనలను నిర్ణీత నమునాలో తగు సమాచారంతో రాతపూర్వకంగా సమర్పించవచ్చన్నారు.

చర్చలకు తాము సిద్ధమే

కాగజ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం యాజమాన్యం, లారీ అసోసియేషన్ మధ్య జరుగుతున్న వివాదంలో కలెక్టర్ సూచించిన విధంగా కమిటీతో తాము చర్చలకే సిద్ధమేనని ఎస్పీఎం యాజమాన్యం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. కలెక్టర్ సూచించిన విధంగా తాము చర్చలకు అంగీకరిస్తున్నామని, లారీ అసోసియేషన్ ముందుకు రావటం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు లారీ అసోసియేషన్ సభ్యుల రాస్తారోకో

కాగజ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎన్టీఆర్ చౌరస్తాలో శుక్రవారం లారీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తున్నట్లు లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ఎస్పీఎం యాజమాన్యం పరిష్కరించే వరకు తాము దశలవారీ పోరాటం చేస్తామన్నారు.

గుడుంబా పట్టివేత

చింతలమానేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం చెక్‌పోస్టువద్ద గురువారం దిందా గ్రామానికిచెందిన దుర్గం బాపు 20లీటర్ల గుడుంబాను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా..

సిర్పూర్(టి), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కాపూర్ గ్రామంలో గురువారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 15లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. ఈ మేరకు దుర్గే చందర్, దుర్గే యశ్వంత్, కామ్లె శ్రీనుపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది వీరస్వామి, నవీన్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో వచ్చే నెల3 నుంచి జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 కబడ్డీ పోటీలకు ఆసిఫాబాద్ పట్టణంలోని ఆదర్శకళాశాలకుచెందిన విద్యార్థులు అంజన్న, రాములు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్, పీడీ తిరుపతి తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడీ అభినందించారు.

నాటక ప్రదర్శన పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్సీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సిర్పూర్ మండలంలో ఈనెల29న నిర్వహించే నాటకప్రదర్శన వాల్‌పోస్టర్లను గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండెవిఠల్ ఆవిష్కరించారు. కాగజ్‌నగర్‌లోని తనక్యాంపు కార్యాలయంలో సిర్పూర్ కాంగ్రెస్‌నాయకులు ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. పలుమండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు ఆయనను కలుసుకొని అభివృద్ధి పనుల విషయమై చర్చించారు. మాలి సంక్షేమసంఘం నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. పోడుభూములపై ఫారెస్టు అధికారులుదాడులు చేస్తున్నారని కాగజ్‌నగర్ మండలం కడంబా గ్రామస్థులు ఎమ్మెల్సీని కలిసి మాట్లాడారు. అటవీ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. నాయకులు అర్షద్ హుస్సేన్, సదాశివ్, శ్రీవర్ధన్, రాచకొండ క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన ఎమ్మెల్సీ దండె విఠల్

కాగజ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు హర్షద్ హుస్సేన్‌ను గురువారం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండెవిఠల్ పరామర్శించారు. మూడురోజుల క్రితం కాంగ్రెస్‌నాయకుడు హర్షద్‌హుస్సేన్ వాహనంపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట మాజీ ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, గజ్జ శ్రీనివాస్, జఫర్, బాబ్‌బాయి తదితరులున్నారు.

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో


బెజ్జూరులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపిస్తూ గురువారం బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని హామీలు ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం వెంటనే రాజీనామా చేసి గద్దె దిగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, ఇస్తారి, ఖాజామైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి


కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రాజేందర్

దహెగాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళాశక్తి పథకంలో భాగంగా 50మంది మహిళలు ఒక్కొక్కరికి 20కోడిపిల్లల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎంచంద్రశేఖర్, మహిళాసమాఖ్య అధ్యక్షురాలు అనసూర్య, పశువైద్యాధికారి శ్రావణ్, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్‌లో మెనూ పాటించాలి

కెరమెరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ హాస్టళ్లలో మెనూపాటించాలని జడ్పీసీఈవో లక్ష్మినారాయణ అన్నారు. గురు వారం మండలంలోని లారిడిగూడ గ్రామంలోని గిరిజనసంక్షేమశాఖ హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం వంటగది, ఆహారపదార్థాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెనూప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణపైవార్డెన్‌ను వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాల యంలో కార్యదర్శులు ఈజీఎస్‌సిబ్బందికి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆయనవెంట ఎంపీడీవో అంజద్ పాషా, ఏపీవో మల్లయ్య, వార్డెన్ ప్రేమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన బుద్దె రవీందర్‌ను గురువారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాంద్రెవిశాల్, జయరాజ్, సంతోష్, శ్రీను, కార్తీక్, రాజేష్ తదితరులు ఉన్నారు.

నాణాలు 'పది'లమే

- చెలామణి గందరగోళంపై రంగంలోకి ఆర్‌బీఐ
- పదిరూపాయల నాణేలను తీసుకోవాలని సోషల్‌మీడియా మెస్సేజ్‌లు
- నిరాకరిస్తే మూడేళ్ల జైలుశిక్ష
- సందేహాలు తీర్చడానికి 14440 టోల్‌ఫ్రీ నంబరు



బెజ్జూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పదిరూపాయల నాణేల చెలామణిలో సందేహాలను తీర్చడానికి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రంగంలోకి దిగింది. ఈ నాణేలను ఎవరూ తీసుకోకపోవడం, చెల్ల వంటూ విస్తృతప్రచారం జరగడంతో చాలామంది వద్ద పది నాణేలు పేరుకుపోయాయి. వీటిని ఎవరు తీసుకుంటారో.. తమ డబ్బులు తిరిగి ఎలా దరి చేరుతాయో తెలియని తికమకపడ్డారు. అయితే ఈ నాణేలు పూర్తిచెల్లుబాటు అవుతాయని, వాటి మారకంలో ఎలాంటి సందేహాలు లేవని ఆర్‌బీఐ చెబుతోంది. పదిరూపాయల నాణేలు తీసుకోవాలని సోషల్‌మీడియా ద్వారా మెసేజ్‌లు ఇస్తోంది. రూ.10 నాణేలను ఎవరైనా తిరస్కరిస్తే మూడేళ్లజైలు శిక్ష పడుతుందని హెచ్చరిస్తోంది. ఈ విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేయాలని విస్తృతప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా దేశంలోని ప్రజలకు అన్ని నెట్‌వర్క్‌ల ద్వారా సెల్‌ఫోన్, సోషల్ మీడియాలో మెసేజ్‌లను పంపుతోంది. నాణేలు అన్నిచోట్లా చెలామణిలో ఉన్నాయని ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేసినా సందేహాలు ఎదురైనా టోల్‌ఫ్రీ నెం.14440కు మిస్డ్‌కాల్ చేయాలని పేర్కొంటోంది. ఈ పదిరూపాయల నాణేలపై 10గీతలు ఉన్నా చెలా మణి అవుతాయని మెసేజ్‌ల ద్వారా ఆర్‌బీఐ తెలుపుతోంది. ఎవరైనా నాణేలను తిరస్కరిస్తే మూడేళ్ల జైలు శిక్ష తప్పదంటోంది. అటువంటి వారిపై ఐపీసీ సెక్షన్124ఏ ప్రకారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచిస్తోంది. రుజువైతే మూడేళ్లజైలు అనుభవించా ల్సిందేనని ఆర్‌బీఐ హెచ్చరిస్తోంది.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెంచికలపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై కొమురయ్య అన్నారు. గురువారం మండలంలోని ఎల్లూరు ఆశ్రమపాఠశాలలో తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నాపాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.